
# కడలి గర్భంలో కాపురం

కె. పట్టాభిరామయ్య




[illegible] తూరుపుకొండ ఎరుపెక్కింది. ప్రకృతికోటికి మెలకువ వచ్చింది.

చీకటి ముసుగులోనుంచి [illegible] కాంత పడుచు కన్ను విప్పేదు. జలరాశినుంచి లేచిన సూర్యబింబం జలంలో మునిగి లేచిన పడతి శాంతివదనంలా వుంది.

చూచునంతలో ప్రొద్దు బారెడు పైకి జరిగింది. చూపుల్లో కొంచెం కరకు పెరిగింది. తరణి అరుణ కిరణాలకొరడా చురుకు మనేసరికి కెరటాల తురగాలకు పురకల్లో చురుకు హెచ్చింది. పరుగున పురికి దరికి యెగురుతున్నాయి. ఎంతగా ప్రయత్నించినా ధరణి పైకి దూకలేక మోకరిల్లి విరివిగా తురగలు విడుస్తున్నాయి.

ఉదయకాంతుల్లో అలలగంతుల్లో సముద్రం సంతోషాల మెరుగు దిద్దుకుని మురిసిపోతుంది. ఆ పొద్దుపొడుపుల్లో సముద్రమ్మీదకు వేటకు వెళ్ళిన నావలు తెరచాపలతో ఎల్లగొడుగుల్లా లేస్తున్నాయి. సమరంలో వ్యూహము పన్నిన విధంగా పడవలు సాగరంలో బారులు తీరి తేలియాడుతున్నాయి.

సందడితో యెగిరిపడుతున్న తరంగాలపై పందెంతో పరుగిడుతున్న వితురంగాలలా దరికి దూసుకు వస్తున్నాయి నావలు. దరికి చేరేకొలది దూరదూరంగా వున్న పడవలన్నీ ఒక్కదారికి చేరుకుంటున్నాయి. నావలన్నీ మొగలోకి చేరాయి. తొలినావ చెలియలి కట్ట దాటింది. ఆ వెనుకనే ఒక్కొక్కపడవ సముద్రాన్ని వదలి నదిలో ప్రవేశించింది. ప్రతి నావకు యిద్దరు ముగ్గురు జాలరు లున్నారు. వారి ముఖాలు విజయగర్వంతో వెలిగిపోతున్నాయి.

పల్లెవడతులంతా వుత్సాహంతో యేటి దరికి వచ్చి మూగారు. గంపలకెత్తుతున్న చేపలను చూచి మురిసిపోతున్నారు. ఆ గుంపులో ఓ పడుచు చుక్కల్లో చందమామలా వుంది. ఆ కన్నెలేడి కన్నార్పకుండా తిన్నగా నావల్లోకి చూస్తుంది, చూపుల్లో ఆతృత అధికమైంది. మనసులో ఆందోళన ఆవరించింది.

'గంగత్తా!' ప్రక్కనున్న ముత్తైదువను పిలిచింది.

'ఎందుకే ?' పలికింది గంగమ్మ.

'మీయబ్బాయేడి ? కనిపించటం లేదు' సిగ్గుతో చిన్నారి పెదవులు తటపటాయించాయి.

గంగమ్మకూడా కాస్సేపు నావలకేసి నిదానించింది. మగనిని పిలిచి అడిగింది. అందరిదృష్టి మరిడి మీదకు మళ్ళింది. 'ఏమయ్యాడంటే యేమయ్యాడు?' ఎవరిమట్టుకు వారే ప్రశ్నించారు.

'మరిడియ్యతో వున్న గున్నయ్యేడో చూడండి' గుంపులోనుంచి అన్నాడొకడు.

గున్నయ్యకోసం చూశారు. అతగాడు కూడా కనిపించలేదు. 'అయితే పడవ తప్పిపోయుంటాది' అని అప్పటికి నిర్ణయించారు.

ఆ పలుకులు కొన్ని లేతగుండెలను కలవరపరిచాయి. నిలువునా తనువు నీరయ్యింది. దుఃఖం ముంచుకు వచ్చింది.

'కంట తడిపెట్టకు భాగమ్మా! పడవ దారి తప్పివుంటాది.'

'రేపు యేటకు యెళ్ళతాంగా యెదకి పట్టుకొత్తాం' అబలకు అప్పటికి ధైర్యం చెప్పారు.

పడవ తప్పిపోయిందో! నడి సముద్రంలో మునిగిపోయిందో!! మళ్ళీ మరిడి గున్నయ్యలను కళ్ళ చూస్తామన్నమాట వాళ్ళకు అనుమానమే!

సాయంత్రానికల్లా ఆ వార్త చుట్టు ప్రక్కన పల్లెలకు పాకిపోయింది. ప్రక్క

వళ్ళో వున్న భాగమ్మ తల్లి మాణిక్యమ్మకు ఈ కబురు వినే సరికి, ఇక కాలూ చేయీ ఆడలేదు. ఎలా వున్నది అలాగే వచ్చి కూతురు చెంత వాలింది. తల్లిని చూచేసరికి భాగమ్మలో వున్న దుఃఖం గట్టుతెగి మరీ పొంగింది. 'అమ్మా!' అంటూ తల్లి ఒడిలో కూలి పోయింది.

తల్లిని పట్టుకుని కూతురు, కూతుర్ని పట్టుకుని తల్లి గొల్లుమన్నారు

'మాణిక్యాదినా! పెద్దదానవు నువ్వే అంత యిదైపోతే యెలా? పిల్లదాన్నేదో సముదాయించాలిగాని, నువ్వు కూడా దాంతో పాటు ఏడుస్తూ కూచుంటే అది మరీ కుంబేలెత్తిపోతాది' పక్కింటి వృద్ధురాలు వచ్చి మందలించింది.

'కడుపుతీపే అనుకో ఏం జేత్తాం! దిగుమింగుకోవాలి.'

'నిద్దర బద్దకాన్నుంటే పడవ దారి తప్పుంటాది.'

'భాగమ్మ తాడు గట్టిదైతే ఏదో మొగకు చేరుకుంటారు '

ఇరుగుపొరుగమ్మలు మూగి తలోవిధంగా ఓదార్చారు. వారి మాటలు దుఃఖాన్ని కొంతవరకు శాంతపరిచాయి. పాపం భాగమ్మ యింకా తల్లి ఒడిలోనే తల దాచుకుని వెక్కి వెక్కి పడుతుంది.

నాలుగు రోజులు గడిచాయి. రోజూ సముద్రంమీదకు వేటకు పోతున్నారు, వస్తున్నారు. కాని మరిడి నావ జాడ లేమీ దొరకలేదు. క్రింది మొగలో వారిక్కి పై మొగలో వారిక్కి కూడా కబురు అంద జేశారు. వారు ఏ జాడ దొరకలేదని తిరుగు కబురు పెట్టారు.

రోజు రోజుకు భాగమ్మ హృదయంలో ఆందోళన అధికమైంది. కూడు నోటికి సహించటంలేదు. తల్లి పూట పూటకు బ్రతిమాలి దగ్గర కూర్చుని మందలించేది. ఓ ముద్ద రెండు ముద్దలు అంతకన్న యెక్కువ నోటికి వెళ్ళేది కాదు 'పోయి వోళ్ళ తోటి పోతామేంటి! ఏదో ఇట్టం చేసుకుని నాలుగు మెతుకులు తినాలిగాని' అని అప్పు డప్పుడు కసిరేది మాణిక్యమ్మ.

ఆ మాటకు అసలే నలిగిపోయివున్న భాగమ్మ పసిహృదయం ఎంత తల్లడిల్లేదో ఆ తల్లికేం తెలుసు. గొడ్డలిపెట్టులా తగిలిన ఆ మాటకు గుండె బ్రద్దలు కాగా కుమిలి కుమిలి యేడ్చేది.

భాగమ్మ ఆ రోజుకారోజు బాగా నీరసించి పోతుంది. కూర్చున్నకడనే కూర్చుంటుంది. నిలబడ్డచోటనే నిల్చుంటుంది. ఎప్పుడూ తడియారని కళ్ళతో ఎక్కడికో చూస్తూ, ఏదో ఆలోచనల్లో తేలుతూ పరాకుగా వుంటుంది.

వారం తిరిగింది. మరిడి గున్నయ్యల కోసం చూడటంలో ఆతృత తరిగింది. ఇక వారు సముద్రం పాలయ్యారనే నిశ్చయాన్కి వచ్చారు. తొందరలోనే మైల మాపివేయటాన్కి నిర్ణయించారు.

ఆ రోజు—

భాగమ్మ పాలిట పరమశత్రువైంద. పసుపు మెడలోని నల్లపూసలు తెగి ఏటిలో ఏకమైనాయి. ముగ్ధ మొగమీద కుంకుమరేఖ రాలి నేలపాలైంది. చిన్నారి చేతుల గాజులు ముక్కలై మట్టిలో మట్టైనాయి. సంఘ నిబంధనలకు గురియై, స్త్రీకి అలంకారములైన పసుపు కుంకాలకు, పువ్వులకు, గాజులకు దూరమై రెమ్మలు విరిచిన పూలమొక్క అయ్యింది. ఆ ఘడియలో ఆమె లేతమనసు ఎంత బాధ పడివుంటుందో పాపం! చిత్రవధ చేసినా అంత బాధ పడివుండదు. ఏ వందల చిత్రవధల వ్యధనో అనుభవించి వుంటుంది.

* * *

'భాగీ...!భాగీ...!......'మగత నిద్రలో వున్న భాగమ్మ చెవిలో తంబుర తీగలా మ్రోగింది.

ఉలికిపడి కనులు తెరచింది. పిలచేది యెవరా? అని ఆలకించింది.

'అబ్బ !...ఈ మొద్దు నిద్దరెప్పట్నుంచబ్బిందే ? ... భాగీ!' ఈ సారి గొంతు కొంచెం గట్టిగా పలికింది.

పలుకు ఈసారి మెలకువలోనున్న ఆమె చెవిలో అమృతాన్ని చిలికింది. హృదిలోఆనందాన్ని కెలికింది.

'ఆ గొంతు మావదే' మనసులో అనుకుని 'వత్తున్నా మావా!' పరుగున వచ్చి తలుపుతీసింది.

కారుమబ్బు తొలగిన చందమామలా తళుకుమన్నాడు భాగమ్మ కనులలో మరిడి మావ. ఒక్క క్షణం తా కళ్ళుచేసుకుని తన మావను ఎగాదిగా చూచింది భాగమ్మ. మరిడి మొగంనిండా నవ్వు నిండింది. ఆ నవ్వులో వెన్నెల జల్లుపడుతుంది. క్షణం రెప్ప వేయకుండా మావ మొగంలోనికి సూటిగా చూచింది.

'ఏం భాగీ ! అలా చూత్తన్నావ్ ?' చూపుల్లోనే చిలిపిగా ప్రశ్నించాడు మరిడి.

ఆ చూపులో ఆమె ప్రతిఅణువు ఆనందంతో నిండింది. ఆనందాశ్రువులు పొంగాయి. కను కొలకుల్లో నిండాయి. ఉబ్బిన ఉబలాటంతో శరీరం సత్తువ గోలుపోయింది. కాళ్ళు యిక నిలద్రొక్కలా పోయింది.

'మావా !' బావురుమంటూ గడపదాటి మరిడి గుండెలపైన వాలిపోయింది.

తూలిపోతున్న లతకు అతడు తరువై నిలచాడు. తరువుకు లత చుట్టుకు పోయింది. ఆనందంతో అధరాలు కదల లేదు. కౌగిలిలో కలుసుకున్న హృదయాలు మూగగా మాట్లాడు కున్నాయి. తన్మయంతో కనులు మూతలుపడ్డాయి.

క్షణాలు గడిచాయి. మరిడికన్నులు విడిచాయి తన జాలిగుండెలో దాచుకున్న భాగమ్మ ముగాన్ని మృదువుగా పట్టియెత్తి ఆ ముగంలోనికి ముద్దుగా చూశాడు. కలువ ముఖంలోనికి జాబిలి చూపులు నిలిపి నటులుందా మధుర వీక్షణం. అతివ కనురేఖల్లో ఆనందాశ్రువులు యింకనూ ఆరలేదు. అవి నీటిబొట్టులు కావు. చంద్రదర్శనంతో కలువరేకుల్లో పొంగిన అమృతబిందువులు.

'ఇన్నాళ్ళు వన్నొదిలి ఎక్కడున్నావ్ మావా ?' చంటిదానిలా గారం గుడిచింది.

సమాధానంగా మరిడి చేతిలో భాగమ్మ లేతబుగ్గలు నలిగిపోయినాయి. దొండ పళ్ళలాంటి పెదవులు విచ్చుకున్నాయి. ముగాన్ని వంచి ఆనందంతో అందుకున్నాడు మరిడి.

'ఉండుమావా !' వెలిసిగ్గు కురిపించింది. సిగ్గులో కనులు వింత సొగసును పులుపుకున్నాయి.

'విన్నొదిలి నేనుండగలనా ! అందుకేగా నడి సంద్రంలో సిక్కినా తప్పించుకుని నీపక్క వాలత' బుజ్జగించాడు

'ఇఃనుంచి నన్నొంటిగా ఒదిలి నువ్వెక్కడికి యెల్లొద్దు మావా!... కేక అయ్యింది భాగమ్మ.

# కడలి గర్భంలో కాపురం

'అయితే మరి పొట్టలోకి ఎట్లాపోవాలా తెల్తాది?' చిలిపిగా నవ్వాడు మరిడి.

సమాధానం తోచక అమాయకంగా చూచింది భాగమ్మ.

'పిచ్చిపిల్లా! పగలనకుండా రేత్తిరనకుండా కూడూగుడ్డకోసం దేవులాడుకునే మనలాంటోళ్లకు ఇక్కడ కాపురం సెయ్యాలంటే ఎడబాటు తప్పదు.'

'మరెక్కడ తప్పుతుంది మావా?' ఉత్సాహంతో అడిగింది.

'ఇన్నాళ్లు నేనున్నచోట. అక్కడ వుందీ లేదూ అన్న బెంగలేదు. ఎప్పుడూ సంతోసంగా గంతులెయ్యొచ్చు ఎంత ఆడినా పాడినా అసూయ పడేవాళ్లే లేరు.' ఉషారుగా చెప్పాడు

'ఐతే ఇంకనే అక్కడికే పోదాం' మగువ మనసు సంబరపడింది

'ఇప్పుడే పోగాం భాగీ!' భాగమ్మ చేయి అందుకుని దారితీశాడు మరిడి. సంతోషంతో మావ జంటను నడిచింది భాగమ్మ.

అలలు ఆనందంతో పొంగిపోగాయి. అడుగులు తేలికగా ముందుకు పోగాయి. చిన్నగా బోటుదగ్గరకు చేరారు. వెన్నెల రాత్రి ఇసుకతిన్నెలో కాలూ నేసగికి వారి కాళ్లు లేడిగంతులు గెంతాయి. చల్లని వెన్నెలలో ఇసుక తిన్నెలలో అలా జంటగా గెంతుతుంటే, మల్లె పువ్వుల్లాంటి వలువల్లో మేనులు దాచుకున్న ఆ మిథునం స్వేచ్ఛగా తిరుగాడుతున్న హంసల జంటలా వుంది.

ముందు తాను నావమీదకు దూకాడు మరిడి. చేయి అందించి భాగమ్మను లాగాడు. ఆ వూపుకు వచ్చి ఆమె మరిడిగుండెలపై బడింది. మళ్లీ వారిమేనులు అల్లుకుపోయాయి మోముల నవ్వులు వూచాయి.

కదలింది నీటిలో తెడ్డు.
వదలింది పడవ ఒడ్డు.

శుక్లపక్ష ద్వాదశ చంద్రుడు చక్కగా నవ్వుతున్నాడు. మబ్బు లేవీ అడ్డులేని మూలంగా ఆ నవ్వులను అడ్డుకునే మొనగాడు లేకపోవటంచే ఎడతెరపి లేకుండా జల్లుతున్నాడు. ఆ నవ్వుల్లో ప్రకృతి అంతా వెండిమెరుగు పెట్టినట్లు మెరుస్తోంది.

తెడ్డు వూపుతో నావ ఒక్కొక్క అడుగే ముందుకు దాటుతుంది. మరిడి తెడ్డు వేస్తున్నాడు భాగమ్మ ఎదురుగా కూర్చొంది. ఓసారి పైనున్న చందమామవంక చూచింది. ఓసారి సరసనున్న మరిడిమావకేసి చూచింది కోమలి మదిలో అనురాగం మోసిరించి. కోకిల కంఠం భూపాలరాగం తీసింది.

'పైనున్న చందమామ
పక్కనా మరిడిమావ
రెప్పవెయ్యక నన్ను
నిక్కినిక్కి సూత్తుంటే
సెప్పరాని సిగ్గేదో
కప్పి ముంచెత్తింది
'చందమావ వెన్నెల్లో
మరిడిమావ నవ్వుల్లో
మోడైన నా బతుకు
మళ్లీ సిగురించింది'

పాట నిలిచింది. పడవ సముద్రాన్ని సమీపించింది. మరిడి మావ సరాకు విడిచి చురుగ్గా తెడ్డు వేయసాగాడు. ఒక్క వూపులో పడవ నదిని దాటి ఉదధిలోనికి దూకింది. మదించిన ఏనుగుల్లా గోల చేస్తూ పరుగున వస్తున్న కెరటాలను మెలకువగా దాటిస్తున్నాడు.


నావ కెరటమ్మీదకు ఎగసినప్పుడు ఆకాశాన్ని అందుకున్నంత అనుభూతి. అంతలోనే పాతాళానికి దిగపోతున్నామేమో అన్న భీతి. పడవ ఒక్కొక్క కెరటాన్నే దాటుతూ దరికి దూరవౌతుంది. దరి దూరమయ్యే కొలదీ అలల విజృంభణ సన్నగిల్లింది. చిరుగంతుల్లో ప్రశాంతంగా వున్న కడలి మధ్యన పడవ ఉయ్యాల లూగుతూ తేలుతుంది.

'బయట అంత అల్లరిచేసే ఈ సంద్రం మయాన ఎంత చల్లగావుంది మావా!' ఉల్లాసంగా ఊపిరి వదలింది భాగమ్మ.

'మంచివాళ్ల తీరే అంత. మాటల్లో కరుకున్నా మనసులు వెన్న' ఉత్సాహంగా మరిడి పెదవులు కదిలాయి.

కలికి కనులు ఆనందంతో దశదిశలకేసి మిలమిల మెరిశాయి. ఆకాశంచుట్టూ నీటిలోన్కి దిగిపోయింది. చుక్కలతో మెరిసిపోతూ ముత్యాలపరదా దిగవేసినట్లుంది. సాగరగర్భం ఆ దంపతులకు అందాల మందిరంలా వుంది. మెల్లగా పూగుతున్న నావ ఊయల మంచంలాగుంది. మధుర స్మృతులతో మనసులు మైమరిచాయి.

'మావా!' అనురాగంతో మగని ఒడిలో



జారిపోయింది జాగునా. 'ఎప్పుడూ ఇక్కడే వుండిపోదాం' అనురాగం తీగపై మ్రోగింది.

'ఇలా జంటగా కలకాలం ఈ సంద్రమ్మ తూనే కాపుర ముండిపోదాం.' వెచ్చని కౌగిలిలో బిగించాడు మురిడి.

* * *

త్రుళ్ళిపడి లేచింది భాగమ్మ. అప్పుడు ఆమె ముగం కళకళ లాడుతుంది. కళ్ళు నులుముకుని చుట్టూ కలియ జూచింది. ఆ క్షణంలో ఆమె వదనం వెలవెల బోయింది. తను మామూలుగా నేలమీద తల్లి ప్రక్కనే పడుకుని వుంది. ఓ క్షణం మనో దృష్టి వెనుకకు మళ్ళించి 'అంతా కలా!' అనుకుని భారంగా గాలి పీల్చి విడిచింది. ఇంకా ఆమె హృదయం ఊహాల్లోనే ఊగిస లాడుతుంది.

దిగులుగా వున్న ఆమె ముగంపై గబాలున ఎందుకో చిరునగవు వెలసింది. నవ్వుతూనే పైకి లేచింది. ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్న తల్లి ముఖంలోనికి ప్రేమగా చూచింది. చూపులోనే కళ్ళల్లో నీళ్ళు తిరిగి వేలకు రాలాయి.

'నేను మావను వొదిలి వుండలేను. నేనూ మావవొద్దకే పోతాను' మనసులోనే గొణుగుకుంది.

గుండె దిటవు చేసుకుంది. కళ్ళ నీళ్ళు తుడుచుకుంది. గుమ్మంకేసి అడుగువేసింది. గడియ తీస్తున్నప్పుడు ఆమె చూపులు ఆకులు రాలిన మోడుల్లావున్న బోడి చేతుల పైన బడ్డాయి. మనసు చివుక్కుమంది. గిర్రున వెనుకకు తిరిగింది. చిలక్కొయ్యకు వ్రేలాడుతున్న పూసలపేరు తీసి రెండు ముక్కలు చేసి బోడిచేతులకు చుట్టబెట్టుకుంది. అద్దం అందుకుని నీడ చూచుకుంది. నెలబాలుడు కనరాని కాళరాత్రిలా వుంది మొగం. సెలయేరు కరువైన ఎడారిలా వుంది మెడ. కుంకుమరేఖ లేని ముఖాన్ని, మంగళసూత్రం లేని కంఠాన్ని చూచుకునేసరికి కనుకొలుకుల్లో నీళ్ళు నిలచాయి. కుంకుమబరిణ తీసి నుదుట బొట్టు పెట్టుకుంది. పసుపుకొమ్ము దారాన్కి ముడివేసి మెడలో కట్టుకుంది. ఆ క్షణంలో సుమంగళి అయ్యింది.

ఈసారి అద్దంలో చూసుకుంది. ముసి ముసిగా నవ్వుకుంది. ఈ పట్టు ఉత్సాహంతో గుడిసెను దాటింది. మనసు తేలిక పడింది.

అప్పటికి చంద్రుడు పడమటి దిశకు వాలుతున్నాడు. వెన్నెల పుచ్చపువ్వులా వుంది. ఎక్కడా ఏ అలికిడి లేదు. ప్రకృతి అంతా కునుకు తీస్తుంది.

పైట చెంగును నెత్తిమీదకు తీసుకుని ముసుగు కప్పుకుంది. మెల్లగా అడుగులు వేస్తూ పల్లెను దాటింది. కాలా ఒడ్డుకు వచ్చింది. పడవలు దరిని కట్టివున్నాయి. ఓ పడవను ఎక్కింది.

తాడు వదిలింది.

నావ కదిలింది.

సముద్రం చంద్రమామను అందుకోవా లనే ఉత్సాహంతో పొంగిపోతుంది.

భాగమ్మ మురిడి మామను చేరుకోవాలనే పులకింతతో పొంగిపోతుంది.

పడవ కెరటాలనెన్నో దాటింది.

కడలి గర్భంలోకి దారితీసింది. ●